క్లుప్తంగా

దేవతామూర్తుల ప్రతిష్ఠోత్సవం



ఎల్లావత్తులలో ధాన్యాదివాసంలో వివిధ దేవతామూర్తుల విగ్రహాలు

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తుల గ్రామంలో పోలేరమ్మ, పుట్టాలమ్మ, పెద్దమ్మ, లక్ష్మీనరసింహస్వామి, చెన్నకేశవస్వామి, నాగ లింగేశ్వరస్వామి వారి నూతన విగ్రహ, శిఖర కలశ, ధ్వజ స్తంభం ప్రతిష్ఠ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు వేద పండితులు గణపతి పూజతో కార్యక్రమం మొదలుపెట్టారు.

ఉర్దూ భాష గొప్పతనాన్ని తెలుసుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(న్యూటౌన్): దేశభాషల్లో ఒకటైన ఉర్దూ భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని మాట్లాడటం, చదవడం నేర్చుకోవాలని మంత్రి ఫరూక్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఆ భాష ప్రాముఖ్యతపై రూపొందించిన వాల్ పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. గురువారం నేషనల్ పీజీ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. మంత్రి మాట్లాడుతూ ఉర్దూ భాష ఒక ప్రాంతం, ఒక వర్గం, ఒక మతానికి చెందినది కాదని, ఇది మన అందరి భాష అని చెప్పారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మహమ్మద్ గౌస్ పీర్, నేషనల్ కళాశాలల ఏఓ రఫీ అహ్మద్, హాఫీజ్ అమ్జద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకోండి



మనమిత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఓపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు

చాగలమర్రి: మనమిత్ర వాట్సాప్ (95523 00009)సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ తాహీర్‌హుసేన్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాయంలో మన మిత్ర గోడ పత్రికలను ఆయా పంచాయతీల కార్యదర్శులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనమిత్ర ద్వారా వివిధ రకాల 250 సేవలను ఈ నెల 15వ తేది నుండి అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ యాప్ ద్వారా కార్యాలయాల చుట్టూ తిరగకుండా పౌరసేవలను త్వరితగతిన పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సబియా, ఆదినారాయణ, నాగార్జున, సుజాత, మనోజ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి దేవస్థానం అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

రిటైర్డ్ ముఖ్య అర్చకుడి మృతి

మహానంది: మహానంది దేవస్థానంలో ముఖ్య అర్చకుడిగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన బేతనభట్ల లక్ష్మీనరసింహ శాస్త్రి అపారో గ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఈఓ శ్రీనివాసుల రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఏఈఓ మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, వేద పండితులు రవి శంకర్ అవధాని తదితరులు నరసింహ శాస్త్రి మృతదేహానికి నివాళులర్పించి, అంత్య క్రియల నిమిత్తం రూ.25 వేల నగదును కుటుంబ సభ్యులకు అందించారు.

సైబర్ నేరాలపై అవగాహన

బండిఆత్మకూరు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు గురువారం ఎస్ఐ జగన్‌మోహన్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, వాట్సాప్‌లలో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దని సూచించారు. అనంతరం 1930, 100, 112 నంబర్ల ప్రాముఖ్యతను వివరించారు.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన భాస్కర డాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణపతి తాండవం, మహాగణపతిం, శివాష్టకం, శివతాండవం, చిదంబర స్తోత్రం, లింగాష్టకం, అయిగిరినందిని తదితర గీతాలకు, అష్టకాలకు సాత్విక, శ్రీశ్వేత, వేద, సాహితి, అక్షయ, మనస్వి, భవ్య, యోగిత తదితరులు నృత్యప్రదర్శన చేశారు.



రైలు వస్తుండటంతో మూలసాగరం వద్ద గేటు వేసిన దృశ్యం



బడికి వెళ్లేందుకు గేటు కింద నుంచి సైకిల్‌ను తీసుకెళ్తున్న విద్యార్థి

ఇంకెన్నాళ్లు ఈ కష్టాలు

నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో మూలసాగరం రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణం కలగా మారింది. దీంతో రైళ్లు, గూడ్స్‌లు వచ్చిన ప్రతిసారి గేట్ వేస్తుండటంతో వాహనదారులు, పాదాచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు అరగంట, గంట సేపు నిరీక్షించాల్సి వస్తుండటంతో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అలాగే నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అండర్‌పాస్ వంతెన ఏర్పాటు చేయకపోవడంతో నూనెపల్లె వాసులు రైలు పట్టాలు దాటి పట్టణంలోకి రావాల్సి వస్తుంది. ఆ సమయంలో వేగంగా ఏదైనా రైలు వస్తే ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. రైల్వే ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి పై రెండు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నంద్యాల పట్టణ వాసులు కోరుతున్నారు. – నంద్యాల(అర్బన్)



గేటు వేయడంతో నిరీక్షిస్తున్న వాహన దారులు



నూనెపల్లె ఫ్లై ఓవర్ కింద పట్టాలపై నడుస్తూ వస్తున్న ప్రజలు

19న జిల్లాస్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ రవిక్రిష్ణ గురువారం ఓ ప్రకటనలోతెలిపారు. పట్టణంలోని నెరవాటి ఇంగ్లిషు మీడియం పాఠశాలలో 7,9 సంవత్సరాలలోపు బాల, బాలికలు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనేందుకు జిల్లా జట్లను ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 18వతేది సాయంత్రం 6గంటలలోపు ఏపీ చెస్‌వెబ్ సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 90104 51585 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు అహోబిలం రానున్న కేంద్ర మంత్రి

ఆళ్లగడ్డ: కేంద్ర బొగ్గు గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం అహోబిలం రానున్నారు. ఉదయం పాణ్యం మండలం పిన్నాపురంలోని గ్రీన్ కో ప్రాజెక్ట్‌ను సందర్శించిన అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో దిగువ అహోబిలం చేరుకొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అహోబిలం హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను అధికారులు, పోలీసులు పరిశీలించారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ నాగఅనసూయ

ఉయ్యాలవాడ : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు, రైతులకు తెలియజేయవలసిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి విపత్తుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. గత మూడు రోజులుగా వివిధ శాఖల అధికారులతో ప్రకృతి వైపరీత్యాలతో అతివృష్టి, అనావృష్టిలతో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నపుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వేసవి కాలంలో భూకంపాలు, అగ్ని ప్రమాదాలు అధికంగా చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వాటిని అరికట్టాలనానరు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పశు వైద్యాధికారిణి నాగశైలజ, మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై జాగ్రత్తగా ఉండాలి

దొర్నిపాడు: ప్రకృతి విపత్తుల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని ఈఓపీఆర్డీ నాగఅనసూయ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ప్రకృతి విపత్తులపై సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలతో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తున్నందున ఉరుములు, మెరుపులకు పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. అలాంటి సమయంలో చెట్లకింద ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సావిత్రి, డిప్యూటీ తహసీల్దారు మధవ, ఎంఈఓ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన

ఆళ్లగడ్డ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రజ్ఞా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వాడే పరికరాలను, తీసుకోవలిసిన జాగ్రత్తల గురించి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోవలనే వాటిపై డెమో నిర్వహించి వివరించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రమాదం జరిగిన సమయంలో ఎలా రక్షించాలో డెమో నిర్వహిస్తున్న దృశ్యం

పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

నంద్యాల(న్యూటౌన్): వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు డిగ్రీ ఆ పై విద్యార్హత కలిగిన విద్యార్థులు సన్నద్ధం కావాలని సెట్కూరు సీఈవో వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూ ఏసీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా యువజన సంక్షేమశాఖ, సెట్కూరు సహకారంతో కేంద్ర, రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాల అర్హత, వయోపరిమితి, సిలబస్ పరీక్ష విధానం మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శశికళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెట్కూరు సీఈవో మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే ప్రణాళిక రచించుకోవాలన్నారు. మొదటి ప్రయత్నంలో విజయం సాధించకపోయిన ప్రయత్నిస్తూ ఉండాలన్నారు. ఉపాధికల్పన అధికారి సోమశివారెడ్డి మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వెంటనే విద్యార్థులు ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిష్టర్ చేసుకోవలాన్నారు. జనరల్ నాలెడ్జ్, గణితంపై పట్టు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ పార్వతి, అధ్యాపకులు రమేష్‌కుమార్, మాదన్న పాల్గొన్నారు.

కళ తప్పిన జాతర

అరకొరగా వృషభాల క్రయవిక్రయాలు

జూపాడుబంగ్లా: ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా యంత్రాలతో సేద్యం చేయటంతోపాటు అటవీశాఖ అధికారులు కలప విక్రయాలను నిషేధించటంతో రైతన్నలకు పేరొందిన తర్తూరు జాతరలో ఏటేటా కలప, ఎద్దుల విక్రయాలు తగ్గిపోతున్నాయి. ఈ ఏడాది తర్తూరు జాతరకు ఆశించిన స్థాయిలో ఎద్దులు రాకపోవటం.. అరకొరగా వచ్చిన ఎద్దుల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో కొనుగోలు కోసం వచ్చిన రైతన్నలు నిరాశతో వెనుదిరిగారు. కలప వ్యవసాయ పరికరాలు లభించకపోవటం, ఎద్దుల పోషణభారం అధికం కావటం, గిట్టుబాటు ధరలు లభించకపోవటం వంటి పలు కారణాల వల్ల కొంత మంది రైతులు వ్యవసాయాన్ని వదులుకుంటూ ఎద్దులను విక్రయించటానికి జాతరకు వచ్చినట్లు చెబుతున్నారు. కొత్తగా వ్యవసాయం ప్రారంభించేందుకు ఎద్దులను కొనాలని వచ్చిన వారికి వాటి ధరలు రూ. 80 నుంచి రూ.1.20 లక్షలు పలుకుతుండటంతో అంత ఆర్థిక స్తోమత లేదంటూ వెనుదిరిగారు.



తర్తూరు జాతరలో పలుచగా కనిపిస్తున్న ఎద్దులు

రమణీయం.. రథోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవస్వామి రథోత్సవంలో భక్తజనం

బేతంచెర్ల: గొరిపేట చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి గురువారం రథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, నైవేద్య సమర్పణ, మహా మంగళహారతి ఇచ్చారు. స్వామిఅమ్మవార్లను రథంపై కొలువుంచి బ్రహ్మణులు లాగారు. ఉత్సవాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణం కిక్కిరిసిపోయింది. ఆలయ ఈఓ మద్దిలేటి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బడిఈడు పిల్లలు

- అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం

నంద్యాల: జిల్లాలో బడిఈడు పిల్లలను గుర్తించి ఈనెల 21లోపు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎంఈఓలు, తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఐడీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆర్డీఓలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ రాము నాయక్, ఆత్మకూరు ఆర్డీఓ అరుణజ్యోతి, డీఈఓ జనార్దన్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జీఓ 117 ప్రకారం పాఠశాలలు సర్దుబాటు చేయడంతో కొంత మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రైవేటు పాఠశాలల్లో చేరారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆ జీఓలో సవరణలు చేసిందన్నారు. దీంతో బడిఈడు పిల్లలందరినీ సర్కారు బడుల్లో చేర్పాలన్నారు. ఒకటో తరగతిలో చేరాలనుకున్న అంగన్‌వాడీ పిల్లలను గుర్తించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంఈఓలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్య, భోజనం తదితర సదుపాయాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

ఈనెల 22 వరకు పోషణ్ పక్వాడ ఉత్సవాలు

ఏప్రిల్ 8వ తేది నుంచి ఈనెల 22వ తేది వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషణ్ పక్వాడ ద్వారా పౌష్టిక ఆహారం అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. దీని వల్ల రక్తహీనత, ఎదుగుదల లోపం, అనీమియా సమస్యలు ఉండవని అన్నారు. మునగాకు తినడం వల్ల రక్తహీనతను అధిగమించవచ్చునని చెప్పారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెత్త చెదారం తొలగింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు వివరించారు. గురువారం ఉదయం విజయవాడ నుంచి సీఎస్ ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరా, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎమ్ఈల సర్వే, నియోజకవర్గాల్లో ఎంఎస్ఎమ్ఈ పార్కుల ఏర్పాటు, స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం కలెక్టర్ స్థానిక అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు.

గ్రామీణ, మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈనెల 19న మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ నెలలో 'ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్' (ఈ వేస్ట్ రీసైక్లింగ్) అంశంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని చెప్పారు. తడి, పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పశువులకు నీటి తొట్లిలు ఏర్పాటు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

నంద్యాల (వ్యవసాయం): డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నంద్యాల డిపోలో డిపో కార్యదర్శి పి.సుబ్బరాజు ఆధ్వర్యంలో గేట్ ధర్నా చేశారు. నాయకులు నరసింహులు, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అర్హులకు పదోన్నతులు ఇవ్వాలని, పనిభార తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే త్వరలో ప్రవేశపెట్టబోతున్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపించాలన్నారు. పాత ఈహెచ్ఎస్ విధానాన్ని అమలు పరచాలని కోరారు. అదే విధంగా అలవెన్స్, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ డ్రైవర్లకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నందీశ్వరుడు, ఏడుకొండలు, చౌరెడ్డి, రఫీ, సుబ్బారావు, రమణ, వలి, తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల డిపోలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూఏ నాయకులు

నైట్ అవుట్ అలవెన్స్ పెంచాలి

ఆళ్లగడ్డ: జీఓ నంబర్ 114 ప్రకారం ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ అవుట్ అలవెన్స్ రూ. 400 పెంచాలని ఆళ్లగడ్డ డిపో సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం డిపో గేట్ ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని విభాగాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 38 డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేసినా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సమ్మెబాట పడతామని హెచ్చరించారు.



ఆళ్లగడ్డ డిపో ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఇద్దరు అరెస్ట్

నంద్యాల: పట్టణంలోని ఇద్దరు వ్యక్తుల వద్ద మారణాయుధాలు, నాటుసారా లభించడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం వన్‌టౌన్ ఏరియాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. బైక్‌పై వెళ్తున హరిజనపేటకు చెందిన కొమ్ముపాలెం బ్రహ్మయ్య, నందమూరినగర్‌కు చెందిన ఇమ్మానియేల వద్ద మారణాయుధాలు, నాటుసారా దొరికిందన్నారు. వారిపై కేసు నమోదు చేసి నంద్యాల కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

గ్రామ సచివాలయంలో సేవలకు అంతరాయం

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం- 1వ గ్రామ సచివాలయంలో గురువారం ఓ కార్పొరేట్ ఆసుపత్రి నిర్వాహకులు వైద్య శిబిరం నిర్వహించారు. దీంతో కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులతో పాటు వివిధ పనుల మీద సచివాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామ సచివాలయంలో ప్రైవేటు కార్యకలాపాలు ఎలా నిర్వహిస్తారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. దీనిపై మేజర్ పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు వివరణ కోరగా సోషల్ సర్వీస్ కనుక వైద్యశిబిరానికి అనుమతించానని చెప్పుకొచ్చారు.

మహిళల భద్రతకు శక్తియాప్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జయరాములు

నంద్యాల: అత్యవసర సమయంలో మహిళలు భద్రత కోసం ప్రభుత్వం శక్తి యాప్ రూపొందించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మహిళా పోలీసుస్టేషన్ సీఐ జయరాములు అన్నారు. నంద్యాల శక్తి టీం బృందాల సహకారంతో పట్టణంలోని గవర్నమెంట్ మహిళా కళాశాలలో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ ద్వారా కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ శక్తి యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా ఆపద సమయంలో తక్షణ సహాయం కొరకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే సెల్‌ఫోన్‌లకు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాల లింకులను క్లిక్ చేయకూడదని, మీ వ్యక్తిగత సమాచారం బ్యాంకు వివరాలు ఎవరితోనో పంచుకోరాదన్నారు.